# తమసోమా...

కశింకోట ప్రభాకరదేవ్




నీరసంతో తూలిపోతున్న శరీరాన్ని అదుపులోనికి తెచ్చుకోవడానికి విశ్వ ప్రయత్నం గావిస్తూ, వాలిపోతున్న కనురెప్పల్ని బలవంతంగా పైకెత్తి చుట్టూ చూసింది పార్వతి.

ఎటు చూసినా నీరు!

కడలి చెలియలికట్టను దాటి, ప్రవాహం వూరునంతటిని ముంచేసిందా అన్నట్లుగా నీరు.

ఆ ప్రవాహంలో చెట్లు...గుడిసెలు... జంతువులు . మనుషులు.... ఒకటేమిటి సమస్తమూ నిర్దాక్షిణ్యంగా కొట్టుకుపోతున్నాయి.

ప్రకృతి గుండె పగిలి రోదిస్తున్నట్లుగా గాలి హోరు—

భయంకర దృశ్యాన్ని చూసి వాలిపోయిన ముఖంలాగ-ఆకాశం.

పార్వతి తనున్న చోటును పరిశీ

లనగా చూసింది. ఇంటి పైకప్పు భాగమది. అన్నీ పెంకులే.

కళ్ళముందు జలభీభత్సానికి శరీరం జలదరిస్తుంటే . . గతం నెమ్మదిగా పీడ కలలాగ గుర్తుకు రాసాగింది.

ఆ రాత్రి—

తన . ద్రితుకును నిర్దాక్షిణ్యంగా కాటేసిన గతరాత్రి—

పాతికేళ్ళ వయస్సుకే తన పసుపు కుంకుమలను నిర్దాక్షిణ్యంగా దోచుకున్న కాళరాత్రి—

ఆ సమయంలో—

'బాబు' వుయ్యాలలో హాయిగా నిద్ర పోతున్నాడు.

తను 'బాబు'కు స్వెట్టరును అల్లు తోంది. సాయంకాలం చల్లగాలికని తోట వైపు షికారుగా వెళ్ళిన 'ఆయన' యింకా రాలేదు.

వారికోసం ఎదురుచూస్తూ, స్వెట్టర్ని అల్లుకుంటూంది తను.

ఇంతలో పిడుగువంటి వార్త!

"తోట దగ్గర బాబుగార్ని ఎవరో తల బ్రద్దలు కొట్టేశారమ్మా!" వారు పనిచేస్తున్న హైస్కూలులోని ప్యూను చెమటలు కక్కుకుంటూ పరిగెత్తుకువచ్చి చెప్పాడు వార్తను.

ఆ వార్తకు తను నిలువెల్లా వణికి పోయింది. గుండెబాదుకుంటూ. .. తోట దగ్గరకు వెళ్ళేసరికి ఆయన ప్రాణాలు అనంతవాయువుల్లో కలసి పోయాయి

రక్తపు మడుగులో నిర్జీవంగా తన ప్రాణంలో ప్రాణం పడివుంది.

ఈ దారుణానికి కారకు లెవరో తనకు తెలుసును.

కాని, ఏం ప్రయోజనం?

'నాయుడు' ఆ వూర్లో చట్టానికి, న్యాయానికి అతీతుడు.

అతడికి ఎదురునిల్చే ధైర్యం వూర్లో ఎవరికీ లేదు.

స్కూలల్లో చదువుకునే అనాధ పిల్లలకు విదేశాలు వుచితంగా యిచ్చే బలవర్ధకాహారపదార్ధాలను 'నాయుడు' బ్లాకులో అమ్ముకోకుండా అడ్డుపడినం దుకు - 'స్కూలు భవనం' రాత్రిపూట నాయుడికి విలాసకేంద్రం కాకుండా చేసినందుకు—వీటన్నింటికన్నా ఆ స్కూలుకు కొత్తగా వచ్చిన టీచరమ్మ నాయుడు అఘాయిత్యానికి బలైపోకుండా కాపాడి, నాయుడిమీద పై అధికారులకు ఫిర్యాదు చేసినందుకు - 'వారు' తన ప్రాణాల్నే అర్పించవలసి వచ్చింది.

నాయుడు తీసిన దెబ్బే యిది

నాయుడి పగ గురించి వూర్లో ప్రచారంలో వున్న కథలను విని-నాయుడికి వారికి మధ్య ఏర్పడుతున్న వైరాన్ని తెలుసుకుని .... తను భయపడుతూనే వుంది వారిని హెచ్చరిస్తూనే వుంది.

ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. స్కూలు ప్యూను, మరికొందరు

వహాయంతో భర్త మృతదేహాన్ని యింటికి తెచ్చింది.

జరిగిన సంఘటనకు పోలీసు రిపోర్టు యివ్వాలనుకొంది. కాని, ఎవరిమీద తను ఇవ్వగలదు? సాక్ష్యం ఎవరు చెబుతారు?? చెప్పగల దమ్ము వూర్లో ఎవరికి వుంది??

'నాయుడూ! నా వుసురు నీకు తగలక మానదు....' మనసులోనే శపించింది. గుండెలవిసేలాగ రోదించింది.

ఈ హడావుడికి వుయ్యాలలో బాబు నిద్రలేచి ఏడ్వసాగేడు.

బైట. చీకటిలోకంలోని అన్యాయం లాగ దట్టంగా వుంది.

జరిగిన ఘోరానికి ప్రకృతికి కోపం వచ్చింది కాబోలు—

ఉరుములు

మెరుపులు

పెనుగాలులు—

'వారి' తలదగ్గర వుంచిన నూనె దీపం గాలికి ఆరిపోయింది.

అంతా చీకటి —

'బాబు' ఏడుపు—

ఇరుగుపొరుగుల ఓదార్పు —

ప్రకృతి ప్రళయ భయంకర రూపం దాల్చింది.

చెవులు చిల్లులు పడేలాగ,...గాలి రొద.

ఆకాశం బ్రద్దలయిందేమో నన్నట్లుగా వాన—

ఎక్కడో పిడుగులు పడుతున్న భయంకర శబ్దాలు

కొద్ది నిముషాల్లో ప్రకృతి భీభత్సం...

బైట, ఏం జరిగిందో తెలుసుకునే లోపల . యింట్లోకి వువ్వెత్తున విరుచుకు పడిన అల —

అంతా జలమయం....

నిస్సహాయస్థితి—

అగమ్యగోచరం—

'బాబు' ఏమయ్యాడోననే ఆందోళనతో నీటిలో వుక్కిరి బిక్కిరవుతూ వుయ్యాలవేపు అడుగు వెయ్యబోయింది—

అంతే ...

మరో 'అల' ప్ర చ ం డ వేగంతో తనను పడద్రోసింది. ఆ తరువాత ఏం జరిగిందో తనకు తెలియదు. స్పృహ తప్పిపోయింది—

గతంనుండి బైటపడింది పార్వతి.

ప్రకృతి యింకా ప్రళయతాండవం సాగిస్తూనే వుంది

అంతా జలమయం—

ఏదీ తనప్రాణంలో ప్రాణం? ఆయన మృతదేహం ఎక్కడ?

ఏదీ తన బాబు? తన వరాల మూట . నోములపంట .. చిన్నారి పాప ఏదీ? ఏదీ??

పార్వతికి దుఃఖం గుండెలోతుల నుండి ఎగదన్నుకు వచ్చింది. అయితే ఏడ్వడానికి కూడా సత్తువలేక. . వరద భీభత్సాన్ని భయం భయంగా చూస్తూ...

విస్పహాయంగా ... నీరసంగా .... తెలివి తప్పి పడిపోయింది.

పార్వతికి తిరిగి తెలివివచ్చేసరికి వరద పూర్తిగా తగ్గిపోయింది.

ఇంటి పైకప్పుమీద నుండి శరీరం లోని శక్తినంతా కూడదీసుకుని, జాగ్రత్తగా దిగింది.

అప్పటికి తను స్పృహతప్పి ఎన్ని రోజులయిందో అంచనా వేసుకోలేక పోయింది పార్వతి.

నేలంతా బురదగా వుంది.

ఎక్కడా మనుషుల అలికిడి లేదు.

గంభీరమైన నిశ్శబ్దం।

స్మశాన ప్రశాంతత.

సర్వం కోల్పోయిన అ భా గ్యు ది మనసుకి ప్రతిరూపంలాగ వుంది వాతావరణం.

ఆకాశం ఏడ్చి ఏడ్చి అలసిపోయిన వ్యక్తిముఖంలాగ వుంది.

భారంగా అడుగులు వేస్తూ పార్వతి ముందుకు నడిచింది.

కట్టుకున్న భర్త, కన్నకొడుకు శాశ్వతంగా దూరమైపోయాడన్న బాధ, దుఃఖం ఆమెను కృంగదీస్తున్నాయి.

లోతుకుపోయిన క ళ్ళ తో చిరిగి పోయిన చీరతో తైల సంస్కారం కోల్పోయి చిందరవందరైన జుత్తుతో పిచ్చిదానిలాగ పార్వతి తయారయింది... ఆమె అడుగులు తడబడుతున్నాయి.

ఎటుచూసినా —

కూలిన యిల్లు ....

యిసుక దిబ్బలు....

జంతువుల మృత కళేబరాలు....

విగతజీవులైన మనషులు. ..

ఎగిరే రాబందులు....

అంతా భీభత్సంగా వుంది.

బురద నేలమీద జా రి పో కు ం డా మెల్లగా .. నీరసంగా . అడుగులు వేస్తూ నడుస్తున్న పార్వతి అకస్మాత్తుగా ఆగిపోయింది.

ఎవరిదో చిన్నగా మూలుగు.

చెవులు రిక్కించి వింది పార్వతి.

ఆ మూలుగు వచ్చినవైపు తలతిప్పి చూసింది.

ఇసుకమేట దగ్గర గుట్టలు గుట్టలుగా శవాలు

తను విన్న ఆ మూలుగు ఆ శవాల వైపు నుండే వచ్చిందని గ్రహించి అటు వైపుగా పార్వతి నడిచింది.


ఆ శవాలను చూసేసరికి కడుపులో దేవినట్లయింది.

ఉబ్బిపోయిన శరీరాలతో వెలికి వచ్చిన నాలుకలతో.. కళ్ళతో...నగ్నంగా అర్ధనగ్నంగా రాశిపోసినట్లుగా వున్నాయి శవాలు

పార్వతికి కళ్ళు తిరిగినట్లయింది. అతి కష్టంమీద తనను తాను నిగ్రహించుకొని పడిపోకుండా.

మళ్ళీ ...

చిన్నగా....బలహీనంగా...మూలుగు:




ఉలిక్కిపడుతూ చూసింది.

ఆ మూలుగు ఒక స్త్రీ ఆకారం దగ్గరనుండి వస్తుంది. ఆ ఆకారం బురదలో స్నానం చేసినట్లుగా వుంది. ఆ ఆకారానికి ప్రాణం ఇంకా పోలేదనడానికి చిహ్నంగా ఉచ్ఛ్వాసనిశ్వాసాలకు అనుగుణంగా పయోధరాలు క్రిందకూ మీదకూ మెల్లగా కదలాడుతున్నాయి.

నిండు చూలాలు ఆ స్త్రీ!

దగ్గరకు వెళ్ళి చూసింది పార్వతి; పక్కలో పిడుగు పడినట్లుగా అదిరిపడింది.

బలహీనమైన శరీరం నిలువునా వణికిపోయింది.

పిడికిలి బిగుసుకొంది.

ఆ ఆకారం .. నాయుడి భార్య!

తన భర్తను పొట్టనపెట్టుకున్న వో నరరూప రాక్షసుడికి అర్ధాంగి!!

క్రోధంతో, కసితో ఆ ఆకారాన్ని చూసి, వెనుతిరగబోయింది పార్వతి. కాని, సాధ్యపడలేదు.

మరల, చిన్నగా ఆకారం మూలుగుతున్న ధ్వని!

ఎదుటి వ్యక్తిలో మానవత్వాన్ని తట్టి లేపుతున్నట్లుగా... మూలుగు.

అప్రయత్నంగా, బిగుసుకున్న పార్వతి పిడికిలి సడలిపోయింది.

పార్వతి దృష్టి ఆ ఆకారం మీద నిలిచిపోయింది. ఆ ఆకారం చిన్నగా కదులుతోంది—

తడారిన పెదవులు .... ఆర్తితో.... వణికిపోతున్నాయి —

"దా.. హం ..." అస్పష్టంగా ఆ ఆకారం కలవరించింది. ఆ ఆకారాన్నే నిర్నిమేషంగా చూస్తున్న పార్వతి హృదయంలో కదలిక మొదలయింది

ఆ సమయంలో ఏం చేయ్యాలో పార్వతికి తోచలేదు. నీటికోసం ఆత్ర తగా నలువైపులా చూసింది. ఎటు చూసినా బురద తప్పించి, తాగడానికి పనికివచ్చే నీరు కనిపించలేదు.

నిస్పృహాయంగా ఆ ఆకారాన్ని చూస్తూ నిట్టూర్చింది పార్వతి. మరు క్షణంలో, బుర్రలో ఏదో మెరుపు మెరిసింది. తను పచ్చిబాలింతరాలిననే విషయం స్ఫురణకు వచ్చింది.

మరింక, ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా గబగబా ఆ ఆకారం దగ్గ రకు నడిచింది పార్వతి. ఆ ఆకారం మీద చిందరవందరగా పడివున్న శవా లను పక్కకు తొలగించింది,

తన జాకెట్టు గుండీలను విప్పి స్తనాన్ని ఆ ఆకారం ఎండిన పెదవుల మధ్యన వుంచి .... నెమ్మదిగా చేత్తో నొక్కింది.

మాతృత్వం పెల్లుబికింది—

మానవత్వం వర్షించింది—

కొద్దిసేపు గడిచిన తరువాత, ఆ ఆకారం అరచేత్తో పొత్తికడుపును పట్టు కొని.... మెలికలు తిరగసాగింది.

ప్రాణం విలవిల్లాడినట్లుగా....మరింత బలహీనంగా ....మూలుగులు....!

ఆ ఆకారం పురిటి నొప్పులు పడు తుందని గ్రహించింది పార్వతి. ఆ భయంకర వాతావరణంలో తన మనసుకు ధైర్యం చెప్పుకొని .... కార్యరంగంలోకి ప్రవేశించింది.

క్షణాలు ....

నిముషాలు....

బరువుగా గడుస్తున్నాయి.

పార్వతి చేతులు వణుకుతున్నాయి—

నుదుట చెమట—

ఏదో వుత్కంఠత—

చైతన్యం జీవం పోసుకున్నట్లుగా ఒకసారి ఆ ప్రాంతం పసివాడి ఏడుపుతో ప్రతిధ్వనించింది.

అరచేత్తో ఆ పిల్లవాడ్ని పదిలంగా పట్టుకొని.... చుట్టూ చూసింది పార్వతి.

ఆమె చేతులు విపరీతంగా వణక సాగేయి. ఆ పసికందును తల్లి పేగునుండి విముక్తిచేసే సాధనం ఏదీ కనిపించలేదు.

పార్వతిలో ఆందోళన చెలరేగింది.

తీవ్రంగా ఆలోచించి, నోటితో తల్లి పేగును కొరికి, ముడివేసి, ఆ పసికందును స్వతంత్రుడ్ని చేసింది.

గుక్కపట్టి ఏడుస్తున్న పసికందును 'తల్లి' పక్కలో వుంచి, గాఢంగా నిట్టూర్చింది. పార్వతి అలసటగా....నీర సంగా ఆ ఇసుకమేటపై కళ్ళు మూసు కుని మగత నిద్రలోకి జారిపోయింది.

సరిగ్గా అదే సమయంలో —

దేశంలోని వివిధ సేవా సంస్థలకు చెందిన వలంటీర్లు అటువైపు వచ్చేరు.